క్లుప్తంగా

విశేష అలంకరణలో భుజలింగేశ్వరుడు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు గట్టుపై వెలసి ఉన్న శ్రీ భుజ లింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు బుధవారం అరటి పండ్లతో శివునికి అభిషేకం చేశారు. పండిన అరటిపండ్లతో స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు. కార్తిక మాసం సందర్భంగా స్వామివారికి ఈ అభిషేకం చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మాలధారులకు భిక్ష ఏర్పాటు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని నామాలగుట్టపై ఉన్న అయ్యప్పస్వామి దేవాలయం వద్ద బుధవారం మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. సతీష్ కుమార్, శశి కళ్యాణి కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారం అందించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు చెల్లు గంగరాజు, గురుస్వాములు వెంకటేష్, సుధీర్ కుమార్, గంగాధర్ రాజు, బుజ్జీలు తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి పూజాది కార్యక్రమాలు నిర్వహించి మాలాధారులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

దుప్పట్లు పంపిణీ

రాజంపేట రూరల్ : పట్టణంలోని ఆర్ఎస్ రోడ్, ఆర్టీసీ, పాత బస్టాండ్‌తో పాటు ప్రధాన రహదారుల పక్కన నిద్రిస్తున్న పేదలకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. 2011వ సంవత్సరం నుండి ప్రతి నెలలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు వ్యవస్థాపకులు పలుకూరి వెంకటరమణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు ఎస్.చిన్నయ్య, ఎస్.మణి, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.సుబ్బరావు, కె.కృష్ణయ్య, పి.భాస్కర్, కె.నరేంద్ర, చంద్ర, సి.రంగలోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

రాయచోటి అర్బన్ : ఎమ్మార్పీఎస్ బలోపేతానికి నేతలు, కార్యకర్తలు మరింతగా కృషి చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లె శేఖర్ కోరారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షుడుగా పనిచేస్తున్న దొడ్డి సురేష్‌ను రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఆమేరకు పత్రాన్ని ఆయనకు పెద్దపల్లె శేఖర్ అందజేశారు. ఎమ్మార్పీఎస్‌ను సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు సురేష్‌తో పాటు సంఘం నేతలు, కార్యకర్తలు కృషి సల్పాలన్నారు.

పోషకాహారంపై అవగాహన ఉండాలి



అవగాహన కార్యక్రమం అనంతరం విద్యార్థులతో పరిస్ ప్రతినిధులు

చిన్నమండెం : మండల కేంద్రంలోని జడ్పీ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సమగ్ర పోషకాలపై పరిస్ కంపెనీ ప్రతినిధులు బుధవారం అవగాహన కల్పించారు. పరిస్ కంపెనీ వారి 55వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోషక ఆహార పదార్థాలు వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కంపెనీ సీఎండీ రాహుల్, ఏజెన్సీ ఇన్‌చార్జ్ సురేష్‌కుమార్, కడప సేల్స్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ

రాయచోటి అర్బన్ : విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించడంతోనే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని యండపల్లె పీహెచ్‌సీ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వై.విశ్వనాథరెడ్డి అన్నారు. బుధవారం మాధవరం గ్రామ పంచాయతీ వడ్డెపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్యసిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతలపై అవగాహనను కల్పించారు. విద్యార్థులు చిన్నతనం నుండే వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో మహిళా హెల్త్ సూపర్‌వైజర్ రమణమ్మ, పాఠశాల హెచ్ఎం శివశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ వితరణ

రామాపురం : మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ సూరకవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలకు గ్రీన్ సోలార్ క్లస్టర్ ఇంచార్జ్ సంపత్‌కుమార్, ఇన్‌చార్జ్ మహేశ్వర్ రెడ్డిల ఆధ్వర్యంలో ప్యూరిఫైడ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్‌రెడ్డికి బుధవారం అందజేశారు. వాటర్ ప్లాంట్‌ను వితరణ చేసిన గ్రీన్‌కో సోలార్ సిబ్బందికి, గ్రామనాయకులు తాతిరెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, కోటిరెడ్డి, రామాంజులురెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

రైల్వేకోడూరు అర్బన్ : బుడిగుంటపల్లి పంచాయతీ తాడివాండ్లపలిలో నూతనంగా నిర్మిస్తున్న మాతమ్మ ఆలయ నిర్మాణానికి వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి బుధవారం రూ. 4 లక్షలు విరాళం అందించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామస్తులకు చెక్కును అందించారు. ఆలయాల నిర్మాణానికి తనవంతు సహకారం ఎప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివయ్య, ఎంపీటీసీ మహేస్వర్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి గడ్డు పరిస్థితులు!



జిల్లా కేంద్రంలో అద్దెభవనంలో ఉన్న గ్రంథాలయం



నలుగురు మాత్రమే కూర్చుని చదవగలిగే ఇరుకైన గది



మూటల రూపంలో అటకెక్కిన విలువైన గ్రంథాలు, పుస్తకాలు

- జిల్లా కేంద్రంలో దశాబ్దాలుగా అద్దెభవనల్లోనే నిర్వహణ
- ఇరుకిరుకు గదుల్లో కొనసాగుతున్న వైనం
- అటకెక్కిన విలువైన పుస్తకాలు
- వెంటాడుతున్న ఉద్యోగుల కొరత

రాయచోటి అర్బన్ : జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని గ్రంథాలయం తూతూమంత్రంగా సాగుతోంది. పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలోని అద్దె ఇంట్లో ఇరుకిరుకు గదులలో నామమాత్రంగా నడుస్తోంది. పాలకుల నిర్లక్ష్యం కారణంగా దశాబ్దాలుగా అద్దెభవనాల్లో కొనసాగుతూ వస్తోంది. గ్రంథాలయంలో స్థలాభావంతో విలువైన గ్రంథాలు అటకెక్కాయి. గ్రంథాలయ నిర్వహణకు నిధుల లేమి, సిబ్బంది కొరత వెంటాడుతోంది.

గత ఏడుదశాబ్దాలుగా రాయచోటిలో గ్రంథాలయం నిర్వహింపబడుతోంది. స్వంత భవనం లేకపోవడంతో మొదట్లో బ్రహ్మణవీధి, తర్వాత బోసనగర్, కొత్తపేటలోని అద్దె భవనాలలో నిర్వహింపబడేది. మొదట్లో లైబ్రరియన్, అటెండర్, వాచ్‌మెన్ తదితర ఉద్యోగులు పనిచేసేవారు. ఉన్నవారు పదవీ విరమణ తరువాత వారి స్థానంలో ఉద్యోగుల నియామకాలు జరగలేదు. దీంతో ప్రస్తుతం ఒక లైబ్రేరియన్‌తోనే గ్రంథాలయం నడుస్తోంది. అధికారుల అలసత్వం కారణంగా గ్రేడ్–1గా ఉండాల్సిన గ్రంథాలయం గ్రేడ్–2గానే కొనసాగుతోంది. పట్టణం జిల్లా కేంద్రంగా ఉండటం, గ్రంథాలయం స్థాయి తక్కువై తగు సౌకర్యాలు లేకపోవడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలక్రమేణా అద్దెలు పెరగడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు చెల్లించే అద్దె (రూ.6500)తో గ్రంథాలయం నిర్వహణకు సరిపడే భవనాలు దొరకడం లేదు. దీంతో విధిలేని పరిస్థితులలో చిన్నచిన్న భవనాల్లోనే నిర్వాహకులు గ్రంథాలయాన్ని నడుపుతూ వస్తున్నారు. ప్రస్తుతం గ్రంథాలయం ఎస్ఎన్ కాలనీలోని ఒక చిన్న అద్దె భవనంలో నడుపబడుతోంది. భవనంలో ఇరుకిరుకు గదులు. ఉన్న రెండు గదుల్లో నలుగురు చొప్పున కూడా కూర్చుని చదువుకోలేని పరిస్థితి. స్థలాభావం కారణంగా గ్రంథాలయానికి చెందిన వేలాది పుస్తకాలను మూటలుగా కట్టి మిగిలిన రెండు గదుల్లో ఉంచారు. ఫలితంగా పాఠకులు చదవాలనుకున్న పుస్తకాలు వారికి అందుబాటులో లేవు. గ్రంథాలయాన్ని దివ్యాంగుల కోటా కింద లైబ్రేరియన్‌గా ఎంపికైన జయభరత్‌రెడ్డి నిర్వహిస్తున్నారు. అటెండర్, వాచ్‌మెన్‌లు లేకపోవడంతో గ్రంథాలయం నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. దశాబ్దాలుగా చిన్నచిన్న సందులు, వీధులలోని అద్దె భవనాల్లోకి గ్రంథాలయాన్ని నిర్వహిస్తుండడంతో చాలామందికి గ్రంథాలయం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాదికారులు స్పందించి అందరికి అందుబాటులో ఉండే విశాలమైన భవనంలోకి గ్రంథాలయాన్ని మార్చాలని పాఠకులు, పట్టణవాసులు కోరుతున్నారు.

లైబ్రరీ ఎక్కడ ఉందో తెలియదు



పట్టణంలో గ్రంథాలయం ఎక్కడ ఉందో పట్టణవాసులకు చాలా మందికి తెలియడం లేదు. ఎస్ఎన్‌కాలనీలో చిన్న అద్దెభవనంలో కొనసాగుతుండడమే ఈ పరిస్థితికి కారణం. ఫలితంగా నిరుద్యోగులు, యువత, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి గ్రంథాలయం ఏమాత్రం ఉపయోగపడడం లేదు. ఉన్నతాధికారులు లైబ్రరీని మరింతగా ఉపయోగంలోకి తేవాలి.

– కోటేశ్వరరావు, విద్యార్థి సంఘం నేత

అందరికి అందుబాటులో రావాలి



జిల్లా కేంద్రంలో లైబ్రరీ అందరికి అందుబాటులో లేకపోవడం దారుణం. గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించి ప్రజలు వినియోగించాలి అని చెప్పే అధికారులు వసతులు కల్పించకపోవడం శోచనీయం. అందరికి అనువైన స్థలంలో గ్రంథాలయాన్ని నిర్వహించాలి. లైబ్రరీ అనేది ఒక విజ్ఞాన భాండాగారం. బయట దొరకని పుస్తకాలు లైబ్రరీలో దొరుకుతాయి.

– వెంకటేష్, ఏఐవైఎఫ్ నేత

స్వంత భవనం నిర్మించాలి



ప్రభుత్వం గ్రంథాలయం కోసం స్వంత భవనాన్ని నిర్మించాలి. దశాబ్దాలుగా అద్దె భవనాల్లో లైబ్రరీ నడుస్తుండటం ఇబ్బందిని కలిగిస్తోంది. తరచూ లైబ్రరీని మారుస్తుండడంతో పరిస్థితి గందరగోళంగా తయారవుతోంది. ప్రభుత్వం వెంటనే అందరికి అనువైన స్థలంలో గ్రంథాలయం కోసం భవనాన్ని నిర్మింపచేయాలి. అలానే గ్రంథాలయం ఎదుర్కొంటున్న సిబ్బంది కొరత లేకుండా చూడాలి.

– ఎస్.కె.హుస్సేన్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు

స్వంత స్థలాన్ని కేటాయించాలి



పట్టణం నడిబొడ్డున అందరికి అనువైన స్థలాన్ని గ్రంథాలయం కోసం కేటాయించాలి. స్వంత భవనాన్ని నిర్మించి ఇవ్వాలి. రెవెన్యూ కాంప్లెక్స్ పరిధిలో అయితే అందరికి అనుకూలంగా ఉంటుంది. స్థలం కోసం అధికారుల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయాం. జిల్లా కేంద్రమైనందున ఇప్పటికైనా స్వంత స్థలం కేటాయించి పుణ్యం కట్టుకోవాలి.

– జయభరత్‌రెడ్డి, గ్రంథాలయాధికారి

పాఠశాల భవనాల పరిశీలన

ఒంటిమిట్ట(సిద్దవటం): మండలంలోని నరసన్నగారిపల్లె గ్రామంలోని శిథిలావస్థలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాలను బుధవారం డీఎల్‌పీఓ రాజ్యలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని కూల్చివేసి నూతన భవనాలను నిర్మించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేయడంతో డీఎల్‌పీఓ క్షేత్ర స్థాయిలో భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను, పాఠశాలలో ఉన్న వసతులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నూతన భవనాలను నిర్మించేలా చర్యలు చేపడతామన్నారు.

'వీఆర్ఓ భూ కబ్జాలపై విచారణ జరపండి'

రాజంపేట రూరల్ : వీఆర్ఓ తిప్పన లక్ష్మయ్య భూకబ్జాదారుడని ఇండ్లూరువారిపల్లి గ్రామానికి చెందిన ఇండ్లూరి నాగిరెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని ఇండ్లూరివారిపల్లెలో బుధవారం నాగిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల కోసం పనిచేయాలి కానీ భూములు కబ్జా చేయటం ఏమిటని ప్రశ్నించారు. మా గ్రామంలో వీఆర్ఏగా పనిచేస్తూ నకిలీ సర్టిఫికెట్లుతో వీఆర్ఓగా పదోన్నతి పొందారన్నారు. కాగా ఇండ్లూరివారిపల్లె లో లక్ష్మయ్య చెప్పిందే వేదమన్నారు. గ్రామంలో రెవెన్యూపరంగా ఎటువంటి సమస్యలున్నా లక్ష్మయ్య ఊ అంటేనే పరిష్కారమవుతాయన్నారు. కాదు అని ఎదురు తిరిగితే వారి మీదికి తన సతీమణి వరమ్మ, కుమారుడు హరిలను ఉసిగొల్పి గొడవ పడి తిరిగి అవతలి వారి మీద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయిస్తాడన్నారు. కాగా పోలీ గ్రామంలో సర్వే నెంబరు 1729/2లో 1.83 ఎకరాలు, 1730/1లో 1.50 ఎకరాలు, 1730/2లో 0.36 ఎకరాలు, 1663/2లో 3.31 ఎకరాలు గ్రామ కంఠం భూములను దర్జాగా కబ్జా చేశాడన్నారు. అదే విధంగా 1728–1లో 5ఎకరాల భూమిని కబ్జా చేసి 1329 ఖాతా నెంబరుతో తన సతీమణి వరమ్మ పేరుతో ఏకంగా ఆన్‌లైన్ చేయించాడన్నారు. ఇదికాక తన బంధువుల పేర్లతో భూములు కబ్జా చేశారని తెలియజేశారు. అయితే 1728–1లోని భూమి విషయమై తాము పోరాటం చేస్తున్నామన్నారు. దీని విషయమై జిల్లా కలెక్టర్, ఆర్‌డీఓకు పలుమార్లు ఫిర్యాదు చేశామన్నారు. అయితే లక్ష్మయ్య తహసీల్దార్‌ల సహకారంతో తనపై ఎటువంటి చర్యలు లేకుండా జాగ్రత్తపడుతున్నారని పేర్కొన్నారు. వీఆర్ఓ లక్ష్మయ్య భూకబ్జాలపై సమగ్ర దర్యాప్తు చేసి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

'సర్వేయర్ భూఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి'

పుల్లంపేట : భూ కబ్జాలకు పాల్పడుతున్న పుల్లంపేట మండలం కొమ్మనవారిపల్లి సర్వేయర్ మల్లికార్జునపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు యర్ర సుమలత తెలియజేశారు. తమ గ్రామంలో సుమలత బుధవారం విలేకరులతో మాట్లాడారు. కొమ్మనవారిపల్లిలో ఖాతా నెంబరు 699లో 846–1, 847 సర్వే నెంబరులో తమకు 2 ఎకరాల పొలం ఉందన్నారు. తన పేరిట ఆన్‌లైన్ కూడా అయిందన్నారు. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సర్వేయర్ మల్లికార్జున, వల్లూరుపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త పోలి జగదీశ్వరరెడ్డితో కలిసి తమకు చెందిన ఎకరా 20 సెంట్ల భూమితోపాటు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని దౌర్జన్యంగా కబ్జా చేశారని తెలియజేశారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయమని కోరామన్నారు. అదే విధంగా గారాలమడుగులో 17–33 సర్వే నెంబరులోని డీకేటీ భూమిని కబ్జా చేసి తన సతీమణి అవ్వారు గౌరి పేరుతో ఖాతా నెంబర్ 120లో ఆన్‌లైన్ చేసుకున్నట్లు తెలియజేశారు. అదే విధంగా పుత్తనవారిపల్లిలోనూ విలువైన ప్రభుత్వ భూమిని అవ్వారు గౌరి పేరు మీద రిజిస్టర్ చేయించుకున్నారని ఆమె పేర్కొన్నారు. ఇటువంటి కబ్జాలు మండలంలో సర్వేయర్ మల్లికార్జున మరెన్నో చేసి వారి బంధువుల పేరు మీద ఆన్‌లైన్ చేయించుకున్నారని ఆరోపించారు. మల్లికార్జున కబ్జా కోరల్లోంచి మా భూమిని మాకు ఇప్పించాలని కోరారు. ఇదే సమయంలో సర్వేయర్ మల్లికార్జున భూ కబ్జాలపై దృష్టి సారించి అతనిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సాంకేతిక విద్యను అందించడమే ధ్యేయం



మాట్లాడుతున్న ఏయూ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : ఆధునిక పరిజ్ఞానం కలిగిన సాంకేతిక విద్యను అందించడమే ధ్యేయంగా ముందుకెళ్లాలని అన్నమాచార్య యూనవర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి అధ్యాపకులకు సూచించారు. బుధవారం ఏయూ ఆడిటోరియంలో అధ్యాపకులకు బోధనపై ప్రత్యేక శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు నిత్యం ఆధునిక సాంకేతిక విద్యలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ దానికి అనుగుణంగా పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యను బోధించే విషయంలో అధ్యాపకులు చేసే కృషి వల్ల అన్నమాచార్య యూనవర్సిటీకి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. హైదరాబాదు విజ్ఞాన భారతి కళాశాల డైరెక్టర్ వైవీఎస్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు మాట్లాడుతూ కేవలం గ్రేడులు కోసం కాకుండా అధ్యాపకులు విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానంలో పట్టుకలిగే విధంగా బోధన కొనసాగించాలన్నారు. అధ్యాపకులు పోటాపోటీగా బోధనలలో మెరుగైన రీతిలో కొనసాగించినప్పుడే విద్యార్థులు సబ్జెక్టులు వారీగా రాణించగలరన్నారు. కార్యక్రమంలో ఏయూ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్స్ డా.నారాయణ, డా.జయరామిరెడ్డి, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో దిగుబడులు

నందలూరు : ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని రాజంపేట వ్యవసాయశాఖ ఏడీ రమేష్ బాబు పేర్కొన్నారు. టంగుటూరు రైతు సేవా కేంద్రంలోని చింతకాయల పల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట ఇన్సరెన్సు ప్రీమియంను డిసెంబర్ 31వ తేదీలోపు చెల్లించాలన్నారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీవల్లి మాట్లాడుతూ వరినారు మడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.మల్లికార్జున, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించామని, రబీలో వరి సాగు చేసుకునేందుకు నారుమడిని పరిశీలించామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో రైతులు వరి, నువ్వులు, పంటలు సాగుచేస్తున్నారని, కౌలు రైతుల ముసాయిదా చట్టంపై అవగాహన కల్పించారు. అలాగే వరి, నువ్వుల పంటలకు రబీలో పంటల బీమా చేయించుకోవాలని తెలిపి కరపత్రాలను అందజేశామన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

బాల్య వివాహాలను అరికట్టడంలో అందరూ కలిసిరావాలని అధికారులు పిలుపునిచ్చారు. బాల్య వివాహ ముక్త్ భారత్‌లో భాగంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. అనంతరం సిబ్బంది, మహిళలు, ప్రజలతో చిన్న వయసులో అమ్మాయిలకు వివాహాలు జరుపకూడదంటూ ప్రతిజ్ఞ చేయించారు. – సాక్షి, నెట్‌వర్క్



రాయచోటి అర్బన్: ప్రయాణికులతో బాల్యవివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయిస్తున్న వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది



పెనగలూరు: బాల్య వివాహాలను అరికడదామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది



సుండుపల్లె మండలంలో..

సంక్షేమ పథకాలు అందడంలేదు

- గుంటిమడుగు ప్రజలతో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మమేకం
- తమ ఇబ్బందులను ఏకరువు పెట్టిన దళితులు



ప్రజా సమస్యలు వింటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు మాకు అందడం లేదని గుంటిమడుగు హరిజనవాడ దళిత ప్రజలు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి ఎదుట వాపోయారు. గుంటిమడుగు హరిజనవాడలో మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, మండల బీసీ నాయకులు పల్లపు రమేష్‌లతో కలసి ప్రజలతో మమేకమయ్యారు. ప్రజలు మాట్లాడుతూ ఈ ఏడాది వానలు సక్రమంగా కురవకపోవడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో వ్యవసాయ కూలీ పనులు తగ్గాయని చెప్పారు. వ్యవసాయంలో పెట్టుబడి నిధి కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు అమలు చేయకపోవడంతోతీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. పాల రేట్లు రూ.10లు మేర తగ్గాయన్నా ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రూ.18 వేలు ఇస్తామని హామీని పట్టించుకోవడం లేదన్నారు. అలానే తల్లికి వందనం, జాబ్ క్యాలెండర్‌ల ఊసేలేదన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఏ పథకం రాకపోవడంతో చేతి ఖర్చులకు డబ్బులు లేక అల్లాడుతున్నామని తమ బాధను శ్రీకాంత్‌రెడ్డికి వెలిబుచ్చుకున్నారు. గత ప్రభుత్వంలో ఠంచన్‌గా పథకాలు అందేవని ఇప్పుడు ఏ పథకం అందకపోతుండటంతో ఆర్థిక భారం కుటంబపోషణపై పడుతోందంటూ వాపోయారు.

కార్యర్తలకు, నాయకులకు ఎల్లవేళలా తోడుంటా

వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులకు ఎల్లవేళలా తోడుంటానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి భరోసా కల్పించారు. గ్రామ స్థాయి నాయకులతో కలసి పలు అంశాలపై చర్చించారు. అందరం సమష్టిగా వైఎస్సార్ సీపీని బలోపేతం చేసుకుందామని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు.

మండల వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ

సంబేపల్లె(రాయచోటి) : ప్రమాదాలలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న సంబేపల్లె మండల వైఎస్సార్‌సీపీ నాయకులను రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం సంబేపల్లె మండల పార్టీ కన్వీనర్ ఉదయ్‌కుమార్ రెడ్డి, గురిగింజకుంటకు చెందిన అన్నారెడ్డిలను వారి స్వగృహాలకు వెళ్లి గడికోట పరామర్శించారు. వీరు ఇరువురు వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో గాయాలపాలై చికిత్స అనంతరం వారి స్వగృహాలలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా వారిని పరామర్శించి వారి ఆరోగ్య స్థితిగతులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ జి.ఉపేంద్ర రెడ్డి, జి.రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, పల్లపు రమేష్, సర్పంచ్‌లు రఘునాథ రెడ్డి, ఆవుల వేణుగోపాల్‌రెడ్డి, అంచాల రామచంద్రుడు, దండు నాగభూషన్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీధర్‌రెడ్డి, నాయకులు వివి ప్రతాప్ రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వాయల్పాడు ఆనందకుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

రాయచోటి టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాస రాజు రాష్ట్ర కేజీబీవీ అడిషనల్ డైరెక్టర్ డి.దేవనాథరెడ్డికి వినతి పత్రం ద్వారా వివరించారు. బుధవారం విజయవాడలోని సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో నూతనంగా అడిషనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను కలసి పుష్పగుచ్ఛం అందజేసి సమస్యల పరిష్కరించాలని విన్నవించినట్లు తెలిపారు. కెజీబీవీలో ప్రధాన సమస్యగా ఉన్న ఎంటీఎస్ అమలుపై సత్వరం నిర్ణయం తీసుకోవాలన్నారు. కేజీబీవీలలో పని చేసే ఉపాధ్యాయులకు రాత్రి పనివేళలు లేకుండా నైట్ షిఫ్ట్ డ్యూటీలకు వార్డెలను నియమించాలని కోరారు. ఆరోగ్య కార్డులు, మహిళలకు ప్రత్యేక సెలవులు, మెడికల్ సెలవులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ నాయకులు ఏబీ రామకృష్ణంరాజు, కె.కులశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

డిసెంబర్ 30లోపు నిర్మాణాలను పూర్తి చేయాలి

పెనగలూరు : డిసెంబర్ 30వ తేదీలోపు పాత పక్కా గృహాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ విజయారావు అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వెలుగు సిబ్బంది, ఉపాధి సిబ్బంది, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద రోజుల యాక్షన్ ప్లాన్ డిసెంబర్ 31తో ముగుస్తుందన్నారు. ఈ లోపల గతంలో మంజూరైన పక్కా గృహాలను పూర్తి చేసేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని వారు తెలిపారు. పక్కా గృహాలు మంజూరైన వారి వద్దకు వెళ్లి వెంటనే పూర్తి చేసే విధంగా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కొత్తగా పక్కా గృహాలు కావాలంటే దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో తెలియకుంటే ప్రజలకు తెలియజేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ హరిప్రసాద్, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

రాయచోటి అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రభుత్వం చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంకం శివారెడ్డి, పోకల మధుసూదన్‌లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో రీజనల్ కన్వీనర్ కె.వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన రాయచోటి రీజియన్ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమ భారాన్ని తగ్గించాలన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలని, సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని రాష్ట్రంలో అమలులోకి తీసుకురావాలంటూ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామంటూ వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ కన్వీనర్ రవీంద్రనాథరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మురళికుమార్, జిల్లా మైనార్టీ కన్వీనర్ మున్వర్‌బాషా, నేతలు నరసింహులు, సదాశివరెడ్డి, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, గోపిక్రిష్ణ, శేఖర్‌రెడ్డి, రామాంజులు, ప్రదీప్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

రాజంపేట టౌన్ : విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం సాగిస్తామని ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 5వ తేదీ నుంచి రెండు రోజులపాటు రాజంపేటలో జరిగే ఆర్ఎస్‌యూ జిల్లా మహాసభల పోస్టర్‌ను ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్‌నాయుడు చేతులమీదుగా బుధవారం స్థానిక చెర్రి స్కూల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ చదువు, పోరాడు, సాధించు అన్న నినాదంతో ఆర్ఎస్‌యూ ఆవిర్భవించి అదే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. మహాసభలకు జిల్లాలోని విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు కొండేటి హరిబాబు, వివిధ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్లు, హెడ్‌మాస్టర్లు నందకిషోర్‌గౌడ్, రెడ్డయ్య, రవీంద్రనాయుడు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచమ వేదం.. మహాభారతం

రాజంపేట రూరల్ : పంచమ వేదంగా భారతీయ ఇతిహాసమైన మహాభారతం ప్రసిద్ధి చెందిందని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ తెలియజేశారు. మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలోని నడిమివీధి రామాలయంలో నిర్వహిస్తున్న ధార్మికోపన్యాసం బుధవారం 2వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వెంకటరమణ మహాభారత విశిష్టతపైన ధార్మికోపన్యాసం గావించారు. ధర్మం ఎక్కడ ఉంటుందో అక్కడ శ్రీకృష్ణ పరమాత్ముడు ఉంటాడని చెప్పారు. శ్రీకృష్ణుడు ఎచ్చట ఉంటాడో అక్కడ విజయం ఉంటుందని అందుకే మహాభారతం జయ కావ్యంగా పేరొందిందన్నారు. కార్యక్రమంలో అయ్యపురాజు చంద్రశేఖర్, హరిరాజు, పెమ్మా సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సిద్దవటం రామ్మోహన్, తోట కనకయ్య, పి.మధు, జి.శేఖర్, జయమ్మ, కనకమ్మ, భక్తులు పాల్గొన్నారు.

30లోపు దరఖాస్తు చేసుకోండి

సుండుపల్లి : మండల పరిధిలోని కొత్తగా పక్కా గృహాలు కావాల్సిన వారు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. స్థలం ఉండి ఇల్లు కావాల్సిన వారు, ఇంటి స్థలం లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చని, ఒక ఇంటికి రూ. 2.50 లక్షలు బిల్లు వస్తుందని వారు తెలిపారు. దరఖాస్తుదారుల భార్యాభర్తల ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, రేషన్ కార్డు, మొబైల్ నెంబర్‌లను తమ సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ దగ్గర అందజేయాలన్నారు.